క్లుప్తంగా

3 వేల మంది మహిళలకు సౌభాగ్యం కిట్లు



మహిళలకు సౌభాగ్య కిట్లు అందజేస్తున్న నిర్వాహకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వర ఆలయం(టీటీడీ)లో సౌభాగ్య కిట్ల పంపిణీ ముగిసినట్లు నిర్వహకులు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సౌభాగ్యం అనే కార్యక్రమం మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు శ్రీవారి దర్శనానిక వచ్చిన ముత్తయిదువులకు పసుపు కొమ్ములు, కుంకుమ, గాజులు, కంకణాలు అందజేశారు. మొత్తం 3 వేల మంది మహిళలకు ఈ కిట్ల పంపిణీ చేసినట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిషోర్, హిందూ ధర్మ ప్రచార సిబ్బంది, జిల్లా ధార్మిక ప్రచార కమిటీ సభ్యులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

అనంతుడికి ఢమరుకం బహూకరణ



సూర్యనారాయణ అందజేసిన ఢమరుకం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురానికి చెందిన సుంకర సూర్యనారాయణ, సూరమ్మ దంపతులు పద్మనాభం కొండపై వెలసిన అనంత పద్మనాభ స్వామికి ఆదివారం ఢమరుకం బహూకరికంచారు. దీని విలువ సుమారు రూ.13 వేలని దాతలు తెలిపారు.

రేపటి నుంచి ఫుట్‌బాల్ టోర్నమెంట్



జెర్సీలను ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఫుట్‌బాల్స్, టీషర్ట్‌ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ మాట్లాడుతూ కలిగొట్ల స్నిగ్ధ జయంతి సందర్భంగా ఈ నెల 12 నుంచి 15 వరకు ఇక్కడి ఫుట్‌బాల్ మైదానంలో ఫుట్‌బాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి జట్టు పాల్గొంటున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆటగాళ్లకు అవసరమైన టీషర్ట్‌లు, ఫుట్‌బాల్స్, ఇతర క్రీడా సామగ్రిని ఫౌండేషన్ సభ్యులు ఆవిష్కరించారు.

పెట్రోల్ బంకుల్లో రక్షణ ప్రమాణాలు గాలికి..



మారికవలసలోని ఓ పెట్రోల్ బంకులో క్యాన్‌లోకి పెట్రోల్ నింపుతున్న సిబ్బంది

మధురవాడ: మధురవాడలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పెట్రోల్ బంకులతోపాటు పాత బంకులు కూడా కనీస రక్షణ, నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. మారికవలస, కొమ్మాది జంక్షన్, మిథిలాపురి వుడా కాలనీల్లో ఉన్న పెట్రోల్ బంకులు అన్నింటిలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా బ్లాక్ మార్కెట్, ప్రమాదాలకు ఆస్కారం ఉండే వాటర్ బ్యాటిళ్ల, క్యాన్లలో పెట్రోల్ నింపకూడదన్న నిబంధనలు ఉన్నా.. వీరు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతి రోజూ వందల సంఖ్యలో వాటర్ బాటిళ్ల, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ నిరాటంకంగా నింపేసుకుని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. తూనికలు కొలతలు, ఇతర నాణ్యత నిర్ధారించే పరికరాలు కూడా కొన్ని చోట్ల కానరాడం లేదు. కొన్ని చోట్ల బీరువాలు, స్టోర్ రూమ్స్‌లో భద్రంగా దాచి పెడుతున్నారు. ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సుగర్ కేన్ కాలనీలో సమస్యల తిష్ట

- తాగునీటికి ఇబ్బందులు
- గోతులమయంగా ప్రధాన రహదారి
- అధ్వానంగా కాలువలు.. పేరుకుపోయిన చెత్త
- పట్టించుకోవాలని స్థానికుల విజ్ఞప్తి



పూడుకుపోయిన డ్రైనేజీ



పార్కులో దట్టంగా పెరిగిన తుప్పలు



కాలువ వద్ద రక్షణ గోడ లేక కుంగిపోయిన రోడ్డు



గోతులతో నిండిన సుగర్ కేన్ లేఅవుట్‌కు వెళ్లే రహదారి



కాలనీలో చెత్త కుప్పలు

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెంలోని సుగర్ కేన్ లేఅవుట్‌లో తిష్ట వేసిన అనేక సమస్యలతో నివాసులు సతమతమవుతున్నారు. ఈ కాలనీలో సుమారు 300 కుటుంబాల వరకూ నివసిస్తున్నారు. ఇక్కడ తాగునీటి సమస్య కొద్ది రోజులుగా వేధిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరం మేరకు తాగునీరు సరఫరా చేయడంలో జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం పూర్తిగా విఫలమైందని చెబుతున్నారు. బయట నీరు కొనుక్కోవాల్సిన దుస్థితి దాపురించిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలనీ రహదారంతా గతుకులే..

ప్రధాన రహదారి నుంచి కాలనీకి వెళ్లే రోడ్డు గతుకులమయంగా ఉంది. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదే రోడ్డులోని కాలువకు రక్షణ గోడ నిర్మించక పోవడంతో కాలువ అంచులు కుచించుకుపోయి ప్రమాదభరితంగా తయారైంది. వర్షాలు కురుస్తున్న సమయంలో మరింత ప్రమాదకరంగా పరిస్థితి ఉంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీ రోడ్డులో ఏర్పడిన గోతులను వెంటనే పూడ్చాలని జీవీఎంసీ అధికారులను కోరుతున్నారు.

ఖాళీ స్థలాల్లో చెత్త డంపింగ్

కాలనీలోని పలుచోట్ల ఖాళీ స్థలాల్లో కొంతమంది చెత్త డంప్ చేస్తున్నారు. వర్షా కాలం కావడంతో రోగాలు ప్రబలుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో పేరుకుపోయిన చెత్త కుప్పలను వెంటనే తొలగించాలని జీవీఎంసీ పారిశుధ్య అధికారులను స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధికి నోచుకోని పార్కు

ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దలు, యువత వ్యాయామం చేసేందుకు, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఇక్కడి పార్కును జీవీఎంసీ అభివృద్ధి చేయకపోవడంతో దానిలో తుప్పలు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. చిన్న పిల్లల కోసం పార్కులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. వాకింగ్ ట్రాక్ నిర్మించలేదు. ఓపెన్ జిమ్ ఉన్నప్పటికీ పార్కు స్థలంలో తుప్పలు పెరిగిపోవడంతో పురుగులు, విషజీవులకు ఆవాస కేంద్రంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీ పార్కు అభివృద్ధికి తగు చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

తాగునీటి సమస్య తీర్చాలి

కాలనీలో తాగు, వాడుక నీటి సమస్య అధికంగా ఉంది. గొట్టపు బావుల నుంచి అవసరం మేరకు నీరు ఉత్పత్తి కావడం లేదు. 500 అడుగుల లోతు వరకూ వెళ్లినా నీరు అంతంత మాత్రం గానే లభ్యమవుతోంది. జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగాధికారులు స్పందించి ట్యాంకుల ద్వారా అవసరాల మేరకు నీటిని సరఫరా చేయాలి.

– పి.చంద్రశేఖర్ సుగర్ కేన్ లేఅవుట్

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

మా కాలనీలో తాగునీరు, రహదారి, కాలువలు, చెత్త డంపింగ్ సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయి. ఇక్కడి పార్కును అభివృద్ధి చేయకపోవడంతో ఆహ్లాదాన్ని కోల్పోతున్నాం. బోర్లను బాగుచేయాలి. సరిపడా తాగునీరు సరఫరా చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. సంబంధిత అధికారులు స్పందించి మా కాలనీ సమస్యలన్నీ పరిష్కరించాలి.

– కె.అప్పారావు, స్థానికుడు

కృష్ణాపురం రైతుల ఆందోళన

జీవనాధార భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణంపై నిరసన



నీలగిరి మొక్కలు తొలగించిన ప్రదేశంలో నిరసన తెలుపుతున్న రైతులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో గల జీవనాధారమైన భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణ పనులు చేపట్టడంపై ఆదివారం స్థానిక రైతులు నిరసన తెలిపారు. పార్కు నిర్మాణానికి సూదికొండ సమీపంలోని కృష్ణాపురంలో పొక్లెయిన్‌తో నిర్వాహకులు రైతులు వేసుకున్న నీలగిరి వంటి విలువైన మొక్కలను తొలగించారు. దీంతో రైతులు అక్కడ ఆందోళన చేసి పనులను అడ్డగించారు. పూర్వీకుల నుంచి వేరుసెనగ, మామిడి, జీడి మామిడి, నీలగిరి వంటి మొక్కలను జీవనోపాధి కోసం సాగు చేస్తున్న భూములను చదును చేసి మొక్కలను ఎందుకు తొలగిస్తున్నారని పశ్నించారు. దీనికి నిర్వాహకులు 66 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణం చేపడతామని సమధానం చెప్పడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 50 కుటుంబాలు ఈ భూమిపైనే ఆధారపడి జీవనోపాధి సాగిస్తున్నామని వారు తెలిపారు. దీనిపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరగనున్న పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

ముగిసిన నాటిక పోటీలు



ప్రథమ బహుమతి పొందిన కేజీబీవీ విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలిలోని కళాసాహితి సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు విద్యార్థులకు నిర్వహించిన నాటిక పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. సంస్థ అధ్యక్షుడు పి.రాజేంద్రప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 11 పాఠశాలల నుంచి విద్యార్థులు నాటికలను ప్రదర్శించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులు ప్రదర్శించిన నాటికకు ప్రథమ బహుమతి లభించింది. ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన నైతిక విలువలు నాటికకు ద్వితీయ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన మాదక ద్రవ్యాల ప్రభావం నాటికకు తృతీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మణికంఠ స్వీట్స్ అధినేత ఆదిమూల నాగరాజు మాట్లాడుతూ ఇటువంటి నాటిక పోటీల వల్ల విద్యార్థుల్లోని ప్రతిభ తెలుస్తుందన్నారు. రాజేంద్ర ప్రసాద్ వర్మ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు. అనంతరం గెలుపొందిన వారికి షీల్డ్‌లు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారు. పోటీల్లో బీజీఎం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన మత్తు మహమ్మారి అనే నాటిక ప్రత్యేక గుర్తింపు పొందగా కళాసాహితి సభ్యుడు ఆడిదం కిశోర్ రూ.3 వేలు అందించారు.

డాక్టర్ సెలవు పెడితే.. ఆస్పత్రి మూతే!

- ఇదీ మధురవాడ ఆయుష్ ఆస్పత్రి పరిస్థితి
- సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్న రోగులు



ఒక్క డాక్టర్ మాత్రమే ఉన్న మధురవాడ ఆయుష్ డిస్పెన్సరీ

మధురవాడ: ఆయుర్వేద, హోమియో, నేచురోపతి వైద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఆయుష్ ఆస్పత్రుల్లో కనీస సిబ్బందిని కూడా నియమించడం లేదు. దీంతో మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న ఆయుష్మాన్ భారత్ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ సెలవు పెడితే మూత పడే స్థితికి వచ్చింది. గతంలో ఇక్కడ డాక్టర్‌తోపాటు ఆఫీస్ సబార్డినేట్ ఉండే వారు. ఆమెకు ఇక్కడ 5 ఏళ్లు పూర్తి కావడంతో వేరే ప్రాంతానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో మరొకరిని ఇక్కడ నియమించలేదు. గత ప్రభుత్వం అల్లోపతితోపాటు హోమియో, పంచకర్మ, ఆయుర్వేద వైద్యానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. కరోనా తర్వాత ఆయుర్వేద, హోమియో పట్ల ప్రజల్లో అవగాహన పెరిగింది. దీంతో ఇక్కడ ప్రతి రోజూ ఓపీ 20 వరకు ఉంటుంది. సిబ్బంది కొరత దీనికి శాపంగా మారింది. కనీసం ఇక్కడ డాక్టర్‌తో పాటు ఇద్దరు సిబ్బంది ఉండాలి. ఒక్కరూ లేక పోవడంతో డాక్టర్ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ముగ్గురు నలుగురు రోగులు ఒకేసారి వస్తే ఒక్కరికి వైద్యం చేసి మందులు ఇచ్చే వరకు ఇతరులు వేచి ఉంచాల్సి వస్తోంది. రోగులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయిని వివరణ కోరగా.. సిబ్బంది కొరత ఉందని, విషయం కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

హామీలు నెరవేర్చని ప్రభుత్వాన్ని

దోషిగా నిలబెడదాం

వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: ఎన్నికల ముందు ప్రజలకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల ముందు దోషిగా నిలబెడతామని వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆనందపురం మండలం చందక పంచాయతీ రామాలయం వద్ద ఆదివారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత గడప గడపకు వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. అమ్మఒడి, రైతు భరోసా, సున్నావడ్డీ, చేయూత, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలే కాకుండా గ్రామగ్రామాన సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. నాడు – నేడు పథకం కింద స్కూళ్లు, ఆస్పత్రులను ఆధునీకీకరించి ఇంటింటికీ రేషన్, వైద్యసేవలు, ఇంగ్లిష్ మీడియం చదువులు అందుబాటులోకి తెచ్చారన్నారు. ప్రస్తుతం అనుకూల మీడియాతో జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అధికారం ఉంటే ప్రజలతో, అధికారం లేకపోతే ప్రజల కోసం వైఎస్సార్ సీపీ పని చేస్తుందన్నారు. జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలతోపాటు సూపర్ సిక్స్ హామీల పేరుతో ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలు పాక్షికంగా అమలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం గెలిచిన తర్వాత రూ.1000 పెన్షన్ పెంపు తప్ప ఏమీ అమలు చేసింది లేదన్నారు. తాము ఊరూరా 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' పేరుతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

సుపరిపాలన పేరుతో వస్తే నిలదీయండి

సుపరిపాలనకు తొలి అడుగు పేరుతో గ్రామాలకు వస్తున్న కూటమి నాయకులను సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలంతా నిలదీయాలని మజ్జి శ్రీనివాసరావు కోరారు. ప్రజలు పథకాల గురించి అడుగుతారనే ఒకటో, రెండో ఇళ్లకు వెళ్లి కూటమి ప్రజాప్రతినిధులు ముఖం చాటేస్తున్నారన్నారు. ప్రస్తుతం వర్షాలు ముమ్మరంగా కురిసి పల్లెలు పాడిపంటలతో కళకళలాడాల్సి ఉండగా... వర్షాలు లేక, ఎరువులు, విత్తనాలు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు వదిలి పెట్టబోమన్నారు. కూటమి ప్రభుత్వం తమకు కావాల్సిన వారికి భూములు కట్టబెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందన్నారు. ఇప్పటి వరకు రూ.1.75 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజలను నిలువునా ముంచేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ బంక శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ పాండ్రంగి శ్రీను, పాండ్రంగి అప్పారావు, పాలూరు బంగారునాయుడు, బంటుపల్లి సూరినాయుడు, గుసిడి వెంకటరావు, అబద్ధం, కలిమి గంగరాజు, లోలుగు రాజు, చందక సూరిబాబు, షిణగం దామోదరరావు, కోరాడ వెంకటరమణారావు, పినిశెట్టి సింహాచలం నాయుడు, షిణగం రాంబాబు, పల్ల రమణ, కోరాడ అప్పలస్వామి నాయుడు, చెన్నా సత్యం, గంటా జగదీష్, కాళ్ల గౌరి, చందక స్వామి, షిణగం చిన రామారావు, గీతల దేవుడు, దొంతల కృష్ణ, రెడ్డి గురునాయుడు, బలిరెడ్డి మహేష్, పాలిన అప్పలరాజు, దొంతల శ్రీను, జిన్నాల వెంకటరమణ, లొడగల నరసింగరావు, తెడ్లాపు గోవింద్, ముసలినాయుడు, దొంతల నాగరాజు, బంక బంగారమ్మ, బూర్లె అప్పలనారాయణ పాల్గొన్నారు.

జూలో సింహాలపై అవగాహన



వెటర్నరీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న క్యూరేటర్ మంగమ్మ

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ప్రపంచ సింహాల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూ బయోస్కోప్‌లో నిర్వహించిన సమావేశంలో సందర్శకులు, వెటర్నరీ విద్యార్థులకు సింహాలపై అవగాహన కల్పించారు. క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పర్యావరణంలో సింహాల ప్రాధాన్యం, జూ పార్కుల్లో వాటి సంరక్షణ చర్యలను వివరించారు. జూ పార్కులో ఒక జత సింహాలున్నాయన్నారు. వాటి సంరక్షణకు నిరంతరం జూ వెటర్నరీ సిబ్బంది, యానిమల్ కీపర్లు జాగ్రతలు తీసుకుంటున్నారన్నారు. వాటికి అందిస్తున్న వైద్య సేవలు, ఆహారం, జాగ్రత్త చర్యలను వివరించారు. ఇటీవల జూలో ఒక సింహాన్ని వివేక్ గోయంకా అనే వ్యక్తి దత్తత తీసుకున్నారన్నారు. మిగిలిన వన్యప్రాణులను కూడా దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఆమె కోరారు. దత్తత తీసుకున్న వారికి ఆదాయ పన్నులో 50 శాతం వరకు మినహాయింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్లు బి.గోపి, పి.వి.చౌదరి, వెటర్నరీ వైద్యుడు పి.భానుబాబు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కనువిందుగా శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శిల్పారామం (జాతర)లో ప్రదర్శించిన కలియుగదైవం శ్రీనివాసుడు, పద్మావతి కళ్యాణం నృత్య రూపకం కనువిందు చేసింది. కళాకారుల అభినయం ప్రేక్షకులను తన్మయపరచింది. నగరంలోని శివ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి జానపద నృత్యాల ప్రదర్శలో భాగంగా నృత్యం చేశారు. కళాకారులు సాయిశ్రీనిత్య, ప్రణతి, హిమవర్షి, కార్తీక, హర్షప్రియ, నిత్యశ్రీవాణి, మీనా, తన్మయిశ్రీ నృత్యం చేయగా ఎస్.మౌనిక నృత్య దర్శకత్వం వహించారు.

యువకులను కాపాడిన లైఫ్‌గార్డులు



యువకులతో లైఫ్‌గార్డులు

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో అలల తాకిడికి కొట్టుకుపోతున్న ఓ యువకుడిని లైఫ్‌గార్డ్స్ రక్షించారు. గోపాలపట్నానికి చెందిన సంతోష్, హేమంత్, గణేష్, లోకేష్ అనే నలుగురు యువకులు ఆదివారం మధ్యాహ్నం సరదాగా గడపడానికి బీచ్‌కు వచ్చారు. వారు సముద్రంలో స్నానం చేస్తుండగా, అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వారిలో ఒకరైన లోకేష్ కొట్టుకుపోయాడు. అది గమనించిన లైఫ్‌గార్డ్స్ ఎస్.నూకరాజు, ఎం.అమ్మోరు, గురుమూర్తి, చిన్నప్పన్న, వెంకటేష్, దేవ వెంటనే స్పందించి ఆ యువకుడిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. మెరైన్ పోలీసులు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. పర్యాటకుడి ప్రాణాలు కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

యారాడ తీరంలో..

పెదగంట్యాడ: యారాడ తీరంలో సరదాగా గడిపేందుకు వచ్చిన యువకుడు సముద్రంలో దిగి కెరటాల ఉధృతికి కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న బీచ్ లైఫ్ గార్డ్స్ రక్షించారు. వివరాలివి. గంగవరానికి చెందిన యవకులు ఆదివారం యారాడ తీరానికి వెళ్లారు. కాసేపు ఇసుక తిన్నెల్లో గడిపిన యువకులు స్నానానికి సముద్రంలో దిగారు. ఒక్కసారిగా అలల తాకిడి పెరగడంతో గరికిన మహేష్(30) సముద్రంలోకి కొట్టుపోతుండగా, అక్కడే ఉన్న లైఫ్ గార్డ్స్ కదిరి లోవేష్‌కుమార్, కదిరి వెంకటేష్, శ్రీనివాస్, కె.వెంకటేష్ గమనించారు. వెంటనే వారు సముద్రంలోకి దిగి, కొట్టుకుపోతున్న మహేష్‌ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దీంతో యువకుడికి ప్రాణాపాయం తప్పింది.

సంగివలస శివారులో ఆకతాయిల ఆగడాలు

వీధిలైట్లు ఏర్పాటు చేయాలని నివాసుల విజ్ఞప్తి





వీధిలైట్లు లేని కొఠారి ఆర్కేడ్ అపార్ట్‌మెంట్ ఏరియా, సంగివలస శివారులో ఆకతాయిలకు అడ్డాగా అపార్ట్‌మెంట్ల పరిసరాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస శివారు ప్రాంతంలో వీధి దీపాలు లేకపోవడంతో అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వారు చీకటి పడితే బయటకు రావడానికి సాహసించడం లేదు. ముగ్గురు అమ్మవార్ల ఆలయాల వెనుక చెరువును ఆనుకుని పలు అపార్ట్‌మెంట్లు, ఖాళీ స్థలాలు ఉన్నాయి. ప్రతి అపార్ట్‌మెంట్ చుట్టూ విద్యుత్ స్తంభాలు, వాటికి కేబుళ్లు బిగించి ఉన్నా వీధిలైట్లు అమర్చలేదు. దీంతో అపార్ట్‌మెంట్ వాసుల రక్షణ కోసం ఒకటో రెండో వీధి దీపాలను సొంత డబ్బులతో ఏర్పాటు చేసుకుంటున్నారు. మిగిలిన ప్రాంతమంతా చీకటి కావడంతో విషపురుగులు, దొంగల బెడద ఎక్కువగా ఉంది. ఆకతాయిలు ఈ అపార్ట్‌మెంట్ల చుట్టూ మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించడానికి చీకటి పడితే ఈ ఇక్కడ వాలిపోతున్నారు. మద్యం తాగిన తరువాత సీసాలు పగలగొట్టడం, ఆ ప్రాంతంలో కనిపించే వారిని అసభ్యకరంగా తిడుతూ నిత్యం చెలరేగిపోతున్నారు. తమ ప్రాంతంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు పలుమార్లు భీమిలి జోనల్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ అపార్ట్‌మెంట్ల వద్ద వీధిలైట్లు ఏర్పాటు చేయడంతోపాటు ఆకతాయిల బెడద వదిలించాలని శివారు ప్రాంత ప్రజలు కోరుతున్నారు.